
సాక్షి పెద్దపల్లి

శనివారం । 18 । ఫిబ్రవరి । 2023



పత్తి క్వింటాల్‌కు రూ.7,672

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు రూ.7,672 పలికింది. రైతుల నుంచి 1,208 క్వింటాళ్లు కొన్నట్లు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి పృథ్వీరాజ్ తెలిపారు.



వెంకన్నకు పూజలు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్వామివారికి క్షీరాభిషేకం చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/16.0

పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఎండ తీవ్రత అధికమవుతుంది. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మల్లికార్జునస్వామి శోభాయాత్ర



శోభాయాత్రలో స్వామివారి ఉత్సవమూర్తులు

ఓదెల: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఓదెల మల్లన్నస్వామి ఉత్సవమూర్తులకు శోభాయాత్ర నిర్వహించారు. అర్చకులు వీరభద్రయ్య, పంచాక్షరి, భవానీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్ర 5 గంటలకు స్వామివారి ఊరేగింపు ప్రారంభమైంది. మహిళలు, భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆలయ పాలకవర్గంతోపాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో మహాశివరాత్రి వేడుకలు



శివపార్వతుల వేషధారణలో విద్యార్థులు

సుల్తానాబాద్: శివుడికి పూజలు చేస్తే ఫలితం ఉంటుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శివపార్వతుల వేషధారణలో చిన్నారులు కనిపించి అలరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్యాంసుందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాక్‌పీస్‌పై శివలింగం



రజనీకాంత్



చాక్‌పీస్‌పై శివలింగం

ఓదెల: మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని మడకకు చెందిన ప్రభుత్వ చిత్రకళా ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్ చాక్‌పీస్‌పై శివలింగాన్ని చెక్కాడు. చాక్‌పీస్‌పై 1.5 సెంటీమీటర్ల ఎత్తున్న శివలింగం, మూడు సెంటీమీటర్ల ఎత్తు త్రిశూలాన్ని నాలుగు గంటలపాటు శ్రమించి కార్వింగ్ ఆర్ట్‌ద్వారా రూపొందించాడు.







ఆటలు.. పాటలు.. కేరింతలు..

గోదావరిఖని: చిన్నారుల ఆటలు.. పాటలు.. పెద్దల కేరింతలు.. చప్పట్ల మధ్య సింగరేణి ఫ్యామిలీ క్లబ్ డే వేడుకలు అట్టహాసంగా ముగిశాయి. యైటింక్లయిన్‌కాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో ఉద్యోగులకు రెండు రోజులు క్రీడాపోటీలు నిర్వహించారు. చివరిరోజు బహుమతులు ప్రదానం చేశారు.

10లో ▸



ముస్తాబైన రామలింగేశ్వర స్వామి ఆలయం



సుల్తానాబాద్‌లోని శివాలయం





విద్యుత్ దీపాల కాంతుల్లో మల్లన్న స్వామి ఆలయం

పూలతోరణాలు.. విద్యుద్దీపాలు

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్/ఓదెల: మహాశివరాత్రికి శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. పూల తోరణాలు.. విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. చలువ పందిళ్లు వేయించారు. జిల్లాకేంద్రంలోని మడ్ల రామలింగేశ్వరస్వామి ఆలయం, స్టేషన్‌రోడ్డులోని శివాలయాల్లో భక్తుల జాగరణ కోసం ఏర్పాట్లు చేశారు. భక్తులు శివపూజకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు భారీగా తరలివచ్చారు. పూలు, పండ్లు, మట్టిపాత్రలు కొనుగోలు చేశారు. కందగడ్డ, కంకులు, గోగిపువ్వు, దీపాంతలు అమ్మకాలు జోరందుకున్నాయి. ఆలయాల్లో శనివారం రాత్రి 12 గంటల తర్వాత శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించనున్నారు.

సంచార విజ్ఞానంతో పరిశీలనాత్మకత



విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తున్న విషయ నిపుణులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో శాస్త్రీయ అభిరుచి, పరిశీలనాత్మక శక్తిని పెంపొందించేలా సంచార విజ్ఞాన గణిత ప్రయోగశాలలను ఏర్పాటు చేశామని జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు తెలిపారు. పెద్దపల్లిలోని బాలుర పాఠశాలతోపాటు మండలంలోని కొత్తపల్లి, మూలసాల, పెద్దబొంకూర్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం సంచార ప్రయోగశాల ద్వారా పలు ప్రయోగాలు చేసి గుణాత్మకవిద్యను అందించారు. 6వతరగతి నుంచి 10 వతరగతి వరకు గల పాఠ్యపుస్తకాల్లోని కఠిన అంశాలను కృత్యాధార బోధన ద్వారా సులువుగా అర్థమయ్యే రీతిలో వివరిస్తున్నట్లు రవినందన్‌రావు తెలిపారు. జిల్లాలోని 122 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే 99 పాఠశాలల్లో అమలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ఆరు బృందాలు.. 57మంది విషయ నిష్ణాతులతో నిర్వహిస్తున్నట్లు వివరించారు. టెన్త్ విద్యార్థులకు ప్రత్యేకంగా టిప్స్ కూడా అందిస్తున్నామన్నారు. హెచ్‌ఎం ఆగయ్య, మురళీనాయక్, రిసోర్స్ పర్సన్ మల్లేశ్, సురేందర్, జగదీశ్వర్‌రెడ్డి, అనిల్‌కుమార్, తిరుపతి, శంకరయ్య, మహిపాల్‌రెడ్డి, టీచర్లు సంధ్య, సురేంద్రప్రసాద్, కొమురయ్య, సౌమ్య, జ్యోతి, శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రాజెక్టు పనులను ఆపించండి

కలెక్టర్‌కు కేకేనగర్ వాసుల విజ్ఞప్తి



వినతిపత్రం అందిస్తున్న కేకేనగర్ వాసులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం వెంకట్రావుపల్లి పంచాయతీ కేకేనగర్ ప్రభుత్వ పాఠశాలకు సమీపంలో సింగరేణి చేపడుతున్న ఓసీపీ–3 ప్రాజెక్ట్ పనులను ఆపించాలని కోరుతూ కేకేనగర్ ప్రజలు కోరారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు వెళ్లగా.. ఆమె అందుబాటులో లేకపోవడంతో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణకు అందించారు. పాఠశాల ప్రహరీ అనుకుని నిర్మిస్తున్న ప్రాజెక్టు పనులతో 300మంది విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతుందని, శబ్ద కాలుష్యంతోపాటు, బ్లాస్టింగ్‌తో ప్రతిరోజూ గ్రామాన్ని దుమ్ము కమ్మేస్తోందని పేర్కొన్నారు. దుమ్ముతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, శ్వాసకోస సంబంధ వ్యాధులు ప్రబలుతున్నాయని వివరించారు. గతంలో ఆర్జీ–2 సింగరేణి యాజమాన్యం వెంకట్రావుపల్లి గ్రామాన్ని ఓసీపీ–3 ప్రాజెక్ట్ విస్తరణకు తీసుకుని గ్రామాన్ని తరలించకుండానే పనులు చేపడుతున్నారని, గ్రామాన్ని సందర్శించి వాస్తవ పరిస్థితులను గమనించి తమకు న్యాయం చేయాలని కోరారు. నాయకులు బుర్ర ముత్యాలగౌడ్, విద్యాకమిటీ చైర్మన్ రామిల్ల శ్రీనివాస్, బుచ్చయ్య, మంథని సాగర్, శివయ్య, ఎల్లయ్య, రామిండ్ల విక్రం ఉన్నారు.

దారులన్నీ ఎములాడకే..

- నేడే మహాశివరాత్రి వేడుకలు
- ఇప్పటికే భక్తులతో రద్దీగా మారిన వేములవాడ
- తరలివస్తున్న అశేష భక్తజనం
- గుడిచెరువులో శివార్చన
- ఉచిత బస్సులు ప్రారంభం.. మూడు రోజులు అన్నదానం
- పోలీసుల భారీ బందోబస్తు



భక్తులతో కిక్కిరిసిన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయం



దర్శనానికి వస్తున్న భక్తులు



కళాకారులతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, తదితరులు

వేములవాడ: దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ హరహర మహాదేవ నామస్మరణతో మారుమోగుతోంది. శివమాలధారులు, వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులతో ఆధ్యాత్మిక క్షేత్రం కిక్కిరిసిపోతోంది. వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాజాతరకు నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడే గుడారాలు వేసుకుంటున్నారు. ధర్మగుండంలోకి అనుమతి లేకపోవడంతో షవర్ల వద్ద స్నానాలు చేస్తున్నారు. గుడి ఆవరణలో జాగరణ కోసం భక్తులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆర్జిత సేవలను రద్దు చేసిన ఆలయ అధికారులు లఘు దర్శనాలకు మాత్రమే అనుమతించారు. రూ.3.70 కోట్లతో జాతర ఏర్పాట్లు చేశారు. రాజన్న గుడి చెరువు ఖాళీ స్థలంలో రాష్ట్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో శివార్చనలో భాగంగా 1,600 మంది కళాకారులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాస్‌ల జారీ విషయంలో ఉద్యోగులు, పుర ప్రముఖులు, స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జాతరకు 3 లక్షల వరకు భక్తులు వస్తారని అధికారుల అంచనా. స్వామి మహామంటపంలో ఉత్సవమూర్తులను సిద్ధం చేసి ఉంచారు.

మొదలైన వేడుకలు

- రాజన్న ఆలయంలో మూడు రోజులపాటు మహాశివరాత్రి వేడుకలు జరుగనున్నాయి. శుక్రవారం తెల్లవారు జామున ఉదయం 3 గంటలకు సుప్రభాత సేవతో ఉత్సవాలు ఆరంభమయ్యాయి.
- ఉదయం 5 గంటలకు ప్రాతఃకాలపూజను స్థానాచార్యులు అప్పాల భీమశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం నిర్వహించారు.
- మధ్యాహ్నం 2.30 గంటలకు స్వామికి మహానివేదన చేశారు.

శనివారం నాటి కార్యక్రమాలు

- శనివారం మహాశివరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. ఉదయం స్వామి వారికి టీటీడీ దేవస్థానం తరఫున పట్టువస్త్రాలను టీటీడీ అధికారులు సమర్పిస్తారు.
- వేకువజామున 3.30 గంటల నుంచి 4 గంటల వరకు ఆలయ శుద్ధి, మంగళవాయిద్యాలు.
- 4 నుంచి 4.25 వరకు సుప్రభాత సేవ
- ఉదయం 7 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున జీఈవో, టీటీడీ అర్చకుల బృందం ఆధ్వర్యంలో రాజన్నకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.
- ఉదయం 8 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్ పట్టువస్త్రాలు సమర్పిస్తారు. మంత్రులతోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొననున్నారు.
- సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు శివస్వాములకు ప్రత్యేక దర్శన అవకాశం.
- సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు కల్యాణ మంటపంలో మహాలింగార్చన.
- రాత్రి 11.35 నుంచి వేకువజాము 3.30 గంటల వరకు లింగోద్భవం. ఈ కాలంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు.

నిరంతర అన్నదానం

జాతర మహోత్సవాలకు వచ్చే భక్తులు, పోలీసు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి స్థానిక వాసవీ సేవా సమితి, మన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఈవో కృష్ణప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ అన్నదానం శని, ఆదివారాలు సైతం కొనసాగుతుందని నిర్వాహకులు మోటూరి మధు, కొమ్మ నటరాజ్ తెలిపారు. దాదాపు 30 వేల మందికి అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

ఉచిత బస్సు సేవలు

దేవస్థానం తరఫున 14 ఉచిత బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు. ఈ సేవలను శుక్రవారం ప్రారంభించారు. తిప్పాపూర్ బస్టాండ్ నుంచి బైపాస్‌రోడ్డు గుండా జగిత్యాల బస్టాండు, గుడిప్రాంతం, బైపాస్‌రోడ్డు ద్వారా కోరుట్లబస్టాండు, ప్రాంతాలను కలుపుతూ తిరిగి తిప్పాపూర్ బస్టాండ్ వరకు చేరుకుంటాయి. భక్తుల రద్దీని బట్టి బస్సులను తింపనున్నట్లు డీఎం మురళీకృష్ణ తెలిపారు.

ప్యూరిఫైడ్ వాటర్

వేములవాడఅర్బన్: మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఆలయ ఈవో కార్యాలయం వద్ద, గుడి పక్కన పార్కింగ్ ఏరియా, బద్దిపోచమ్మ గుడి వద్ద రాజన్న జలప్రసాదం మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాట్లు చేశారు. రాజన్న ఆలయం ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ట్యాంక్‌లను ట్రాలీ ఆటోలపై ఏర్పాటు చేసి ఉంచారు.

కేంద్ర, రాష్ట్ర పాలనలో సామాన్యుల బతుకులు ఆగం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్



ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎస్ రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో సామాన్యుల బతుకులు ఆగమయ్యాయని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కార్పొరేషన్ పరిధి 36, 45వ డివిజన్‌లో పర్యటించారు. గడపగడపకూ పాదయాత్రన వెళ్లారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తుంగలో తొక్కి అసమర్థ, అవినీతి పాలన సాగిస్తున్నారని, దళితుల మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సింగరేణి కార్మిక కుటుంబాలకు శుభ్రమైన తాగునీరు కూడా అందించలేని దుస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతామని వివరించారు. ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపేందుకు చూస్తున్నాయన్నారు. ఆయన వెంట మహంకాళి స్వామి, ముస్తాఫా, పెద్దెల్లి ప్రకాశ్, యుగేందర్, ఆసిఫ్ పాషా, పెండ్యాల మహేశ్, సిరిసెట్టి సతీశ్, దొంతుల లింగం, దూళికట్ట సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార్మిక సంఘం వివాదంపై జేసీ విచారణ



పందిల్లలో ముదిరాజ్ కులస్తులను విచారిస్తున్న జేసీ లక్ష్మీనారాయణ

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్ల మత్స్యకార్మిక సంఘంలో ఏర్పడిన సభ్యత్వ వివాదంపై జేసీ లక్ష్మీనారాయణ శుక్రవారం విచారణ నిర్వహించారు. సభ్యత్వ నమోదు విషయంలో కొంతకాలంగా వివాదం తలెత్తడంతో వివాదాన్ని పరిష్కరించి.. తమకు న్యాయం చేయాలని మత్స్యకారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ కొనసాగింది. ఇరువర్గాలను విచారించి రుసుం లేకుండా అర్హులందరినీ మత్స్యకార సొసైటీలో పేర్లు నమోదు చేయాలని ఫిషరీష్ అధికారులకు జేసీ ఆదేశాలిచ్చారు. సొసైటీ సభ్యులు సమన్వయంతో మెలగాలని హితవు చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ అనుపమరావు, ఫిషరీష్ అధికారులు భాస్కర్, వెంకటేశ్వర్ రావు, ఎస్సై రాజవర్ధన్, ఎంపీటీసీ రావి సదానందం, సర్పంచు దాసరి లావణ్య, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు దాసరి మల్లేశ్, ఉపాధ్యక్షుడు కందుల మల్లేశ్, ప్రధాన కార్యదర్శి బండి రవి, నాయకులు రాయమల్లు, రమేశ్, సదానందం, స్వామి, ఉదయ్, మహేందర్, కొమురయ్య ఉన్నారు.

క్లుప్తంగా

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి



మ్యాన్‌రైడింగ్ ద్వారా గనిలోకి వెళ్తున్న జీఎం

గోదావరిఖని: రక్షణపై అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. శుక్రవారం ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో మైన్స్ ప్లానింగ్ ద్వారా వివరాలు తెలుసుకొని ఏరియాలోని వకీల్‌పల్లి గనిని సందర్శించారు. ఎల్‌హెచ్‌డీ, కంటిన్యూస్ మైనర్ ఉత్పత్తి తీరును అధికారులతో సమీక్షించారు. మ్యాన్‌రైడింగ్ ద్వారా గనిలోకి వెళ్లి 3వ సీమ్ టాప్ సెక్షన్‌లో నడుస్తున్న కంటిన్యూస్ మైనర్ ఉత్పత్తిని తెలుసుకున్నారు. పనిస్థలాలు పరిశీలించి లక్ష్యాలకు అనుగుణంగా ముందుకెళ్లాలని సూచించారు. ఆర్థిక సంవత్సరం దగ్గర పడుతున్నందున గనికి కేటాయించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని గడువులోపే పూర్తి చేయాలని ఆదేశించారు. జీఎం వెంట గని ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, గని మేనేజర్ రవికిరణ్, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్, సర్వే అధికారి అఫ్సర్‌పాషా, సంక్షేమాధికారి ఓంకారిబాబు తదితులున్నారు.

సింగరేణి ఉద్యోగికి అభినందన



శేష్యంత్‌రెడ్డిని సన్మానిస్తున్న జీఎం

గోదావరిఖని: క్రికెట్‌లో సింగరేణి సంస్థ తరపున కోల్ ఇండియాస్థాయి పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ప్రభుత్వ రంగ (పబ్లిక్ సెక్టార్) జట్టుకు ఎంపికైన వకీల్‌పల్లి గని బదిలీ వర్కర్ శేష్యంత్‌రెడ్డిని శుక్రవారం ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ శాలువాతో సన్మానించి అభినందించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను సింగరేణి యాజమాన్యం ప్రోత్సహిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ జట్టులో స్థానం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, డీజీఎం(పర్సనల్) రాజేంద్రప్రసాద్, సీనియర్ పీవో వేణుగోపాల్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ బెక్కం రవి పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహణకు బహిరంగ వేలం

రామగిరి(మంథని): మండలంలోని బుధవారంపేట(రామయ్యపల్లి)లో బెల్టు షాపు నిర్వాహణకు శనివారం బహిరంగ వేలం నిర్వహించారు. గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాట పోటాపోటీగా సాగింది. చివరకు రూ.1.90 లక్షలకు గ్రామానికి చెందిన ఓ యువకుడు దక్కించుకున్నాడు. అయితే వేలం దక్కించుకున్న వ్యక్తి మార్చి 1 నుంచి రెండేళ్ల పాటు మాత్రమే గ్రామంలో మద్యం విక్రయించాలని నిర్ణయించారు. ఎవరైన రహస్యంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడితే పెద్ద మొత్తంలో జరిమానా విధించాలని తీర్మాణించారు. గత 2020 జూన్ 19న నిర్వహించిన వేలం కంటే ఈసారి నిర్వహించిన వేలంలో నాల్గింతల ఆదాయం సమకూరింది. కాగా ఇటీవల రాజాపూర్‌లో నిర్వహించిన బెల్ట్‌షాప్ నిర్వహణవేలంలో రూ.1.50 లక్షలకు ఓ వ్యక్తి దక్కించుకున్నారు. గ్రామాల్లో ఇలా బెల్ట్‌షాపుల నిర్వాహణకు బహిరంగ వేలాలు నిర్వహిస్తున్నా నియంత్రించాల్సిన సంబంధిత అధికారులు మీనమేషాలు లెక్కించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు సామగ్రి దగ్ధం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన వావయినీల శేఖరయ్య ఇంట్లో శుక్రవారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని సామగ్రి దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. కుటుంబసభ్యులు కూలీ పనికి వెళ్లిన సమయంలో జరిగిన ప్రమాదంలో సుమారు రూ.50వేల విలువ చేసే సామగ్రి, బియ్యం, బట్టలు కాలిపోయినట్లు బాధితుడు వాపోయాడు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ నల్ల మనోహర్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.5వేలు నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందించారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు





కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే చందర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని/కాల్వశ్రీరాంపూర్/రామగుండం/పెద్దపల్లిరూరల్/ఓదెల: రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించారు. జన్మదిన కేక్‌ను కట్ చేసి పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, వివిధ కార్యక్రమాలు చేపట్టారు. గోదావరిఖని సింగరేణి స్టేడియం గ్రౌండ్‌లో కేసీఆర్ గోల్డ్ కప్, కోరుకంటి కబడ్డీ ఛాంపియన్ షిప్–2023 పోటీలను ప్రారంభించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్ మాట్లాడుతూ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని అన్నారు. గ్రామీణ క్రీడలు, క్రీడాకారులను ప్రోత్రహిస్తూ క్రీడల్లో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రామగుండం మేయర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, సీఐలు రమేశ్‌బాబు, ప్రసాదరావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి మూల విజయారెడ్డి, కార్పొరేటర్లు అడ్డాల గట్టయ్య, దొంత శ్రీనివాస్, ఇంజపురి పులేందర్, కుమ్మరి శ్రీనివాస్, నాయకులు వంగ శ్రీనివాస్‌గౌడ్, బాలరాజ్‌కుమార్, అడ్డాల రామస్వామి, తానిపర్తి గోపాల్‌రావు, నారాయణదాసు మారుతి, బొడ్డు రవీందర్, జేవిరాజు, పర్లపల్లి రవి,



కాల్వశ్రీరాంపూర్: హోమంలో పాల్గొన్న పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

కనకం శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లోని రామాలయంలో కేసీఆర్ దేశ ప్రధాని కావాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రత్యేక రుద్రహోమం నిర్వహించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ పాల్గొని మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దేశ భావి ప్రధాని కావాలని కోరుకుంటున్నారని అన్నారు. బస్టాండ్ చౌరస్తాలో ఎంపీపీ నూనేటి సంపత్ నేతృత్వంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ గొడ్డు రాజకొమురయ్య, పీఏసీఎస్ చైర్మన్లు రాంచంద్రారెడ్డి, పురుషోత్తం, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ దేవయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, వేద పండితులు అంబరీష్ శర్మ, సతీష్ శర్మ, మహేశ్ పంతులు, దత్తు శర్మ తదితరులు పాల్గొన్నారు. అంతర్గాం మండల కేంద్రంలోని నూకాంబిక పోచమ్మ ఆలయం, ముర్మూర్, అంతర్గాం శివాలయాల్లో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రత్యేక పూజలు చేశారు. అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణ, ఎంపీపీ దుర్గం విజయ, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, కొలిపాక శరణ్యరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోతు తిరుపతినాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోల సంతోశ్‌గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు బాదరవేణి స్వామి, ధర్ని రాజేశ్, ధర్మాజి కృష్ణ, బండారు ప్రవీణ్, కుర్ర వెంకటమ్మ పాల్గొన్నారు. పెద్దపల్లిలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ పాల్గొన్నారు. పెద్దపల్లి మండలం ముత్తారంలో పనిచేస్తున్న ఉపాధికూలీలతో కలిసి కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ కునారపు రేణుకదేవి, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, యూత్ అధ్యక్షుడు మ్యాడగొని శ్రీకాంత్‌గౌడ్, నాయకులు డాక్టర్ సతీశ్, పోలోజు రమేశ్ పాల్గొన్నారు.

జేఎన్టీయూలో నిర్మాణ పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న వెంకటేశ్వరరెడ్డి

రామగిరి(మంథని): రామగిరి మండలం సెంటినరీకాలనీలోని జేఎన్టీయూ యూనివర్సిటీ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో చేపడుతున్న బాయ్స్ హాస్టల్ భవన ఫ్లోర్ ఎక్స్‌టెన్షన్ పనులను యూనివర్సిటీ చీఫ్ ఇంజినీర్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం చేసి స్లాబ్ వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డెప్యూటీ డైరెక్టర్ శ్రీలక్ష్మి, యూనివర్సిటీ టెక్నికల్ ఇంజనీర్ చంద్రశేఖర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్ రెడ్డి, డీఈఈ సతీష్ కుమార్, అవుట్ సోర్సింగ్ ఏఈఈ ప్రభాకర్, సైట్ ఇంజనీర్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు సుందిళ్ల శ్రీనివాస్(30) శుక్రవారం గోదావరిఖనిలోని గోదావరి బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. గోదావరిఖని టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుందిళ్ల శ్రీనివాస్ ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లి గనిలో విధులు నిర్వహిస్తూ.. కొన్ని రోజులుగా కుటుంబసభ్యులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం గోదావరి నది వద్దకు వెళ్లి అందులో దూకాడు. అక్కడ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సదానందం గమనించి వెంటనే బోట్ వారి సహాయంతో బయటకు తీశారు. 108 అంబులెన్సులో గోదావరిఖని ఏరియా ఆస్పత్రికి తరలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. నదిలో ఆత్మహత్యయత్నంకు పాల్పడిన వ్యక్తిని కాపాడిన కానిస్టేబుల్ సదానందంతో పాటు బోట్ వారిని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్, టూటౌన్ సీఐ వేణుగోపాల్‌లు అభినందించారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం



మాట్లాడుతున్న విలాస్ శ్రీనివాస్ పొద్దార్

రామగిరి(మంథని): సింగరేణి ప్రభావిత గ్రామం రామగిరి మండలం పన్నూరులో ఈనెల 19న సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సింగరేణి ఏరియా అధికార ప్రతినిధి విలాస్ శ్రీనివాస్ పొద్దార్ తెలిపారు. శనివారం సెంటినరీకాలనీలోని జీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంవీటీసీ (ప్రాజెక్టు అధికారి) కార్యాలయంలో నిర్వహించే శిబిరంలో నేత్ర, ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, గుండె, దంత, ఛాతి, చెవి, ముక్కు, గొంతు, గైనకాలజిస్టు వైద్య నిపుణులు అందుబాటులో ఉండి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని పన్నూరు గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కల్వర్టును ఢీకొన్న కారు

- టీఆర్‌ఎస్ నాయకుడు 'బొమ్మగాని' మృతి
- బసంత్‌నగర్ విమానాశ్రయ స్థలం వద్ద ఘటన



బొమ్మగాని తిరుపతి మృతదేహం



కూలిన కల్వర్టు

పాలకుర్తి(రామగుండం): పాలకుర్తి మండలం బసంత్‌నగర్ విమానాశ్రయ స్థలం సమీపంలో మండల ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి కల్వర్టును వేగంగా కారు ఢీకొన్న ఘటనలో టీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బొమ్మగాని తిరుపతిగౌడ్ (45) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు వ్యక్తులు బుర్ర సతీశ్‌గౌడ్, శ్రీహరిలకు తీవ్ర గాయాలయ్యాయి. బసంత్‌నగర్ పోలీసులు, మృతుడి సన్నిహితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుక్కలగూడూర్ గ్రామానికి చెందిన బొమ్మగాని తిరుపతి కొన్నేళ్లుగా గోదావరిఖనిలోని రమేశ్‌నగర్‌లో నివాసముంటున్నాడు. శుక్రవారం సాయంత్రం ఎన్టీపీసీకి చెందిన తన మిత్రులు బుర్ర సతీశ్, శ్రీహరిలతో కలిసి కారులో కొత్తపల్లిలోని ఓ విందు సమావేశానికి హాజరై తిరిగి వస్తుండగా రాత్రి 8.30 గంటల సమయంలో బసంత్‌నగర్ విమానాశ్రయం బిల్డింగ్ ఎదురుగా ప్రధాన రహదారిపై గల కల్వర్టును వేగంగా ఢీకొట్టింది. కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. కారు ఏయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో ముందుభాగంలో కూర్చున్న సతీశ్, శ్రీహరిలకు ప్రాణాపాయం తప్పి తీవ్ర గాయాలయ్యాయి. వెనుక సీట్లో కూర్చున్నట్లు అనుమానిస్తున్న తిరుపతిగౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రైవేటు వాహనంలో ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న బసంత్‌నగర్ ఎస్సై శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కాగా తిరుపతిగౌడ్ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితుల విషయంలో డబ్బులు తీసుకుని మోసం చేసిన కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. ప్రస్తుతం తిరుపతి మృతి రామగుండం నియోజకవర్గ వ్యాప్తంగా చర్చనీయాశంమైంది. సంఘటనా స్థలానికి రామగుండం కార్పొరేటర్ పెంట రాజేశ్, పార్టీ మండలాధ్యక్షుడు ఇంజపూరి నవీన్‌లు చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.

సమస్యలు పరిష్కరించాలని సమ్మె నోటీసు



ప్రాజెక్టు అధికారికి నోటీసు అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–5 ఓసీపీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాదన మహేశ్ మాట్లాడుతూ కొన్ని నెలలుగా బొలెరో, క్యాంపర్ వాహనాలపై పనిచేస్తున్న కాంట్రాక్టు డ్రైవర్లకు చట్టప్రకారం రావాల్సిన కనీస వేతనాలు, అలవెన్సులు, బోనస్‌లు, పీఎఫ్ అమలు కావడం లేదన్నారు. ఈనెల 20లోగా పరిష్కరించకుంటే సమ్మె చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్జీ–1 బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గండి ప్రసాద్, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు అబ్దుల్ కరీం, చంద్రశేఖర్, కాంట్రాక్టు డ్రైవర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ మున్సిపల్ పరిధి ఇప్పలనర్సింగాపూర్‌కు చెందిన బీటెక్ విద్యార్థి గాజ సాయికుమార్(22) శుక్రవారం హన్మకొండ జిల్లా నడికూడ మండలం కౌకొండ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజ సాయికుమార్ వరంగల్‌లోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం అతని స్నేహితులు భరత్‌రెడ్డి, శివలతో కలిసి ద్విచక్రవాహనంపై కౌకొండలోని స్నేహితులను కలిసేందుకు వెళ్లారు. తిరిగి వస్తుండగా గ్రామ కమాన్ వద్ద గల మూలమలుపులో బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పరకాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

విధుల్లో చేరిన జేఎన్టీయూ డీఈఈ

రామగిరి: జేఎన్టీయూ డీఈఈగా సతీశ్ శుక్రవారం విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేసిన లక్ష్మణ్ సుల్తాన్‌పూర్ జేఎన్టీయూకు బదిలీ కాగా.. అక్కడి నుంచి సతీశ్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. సతీశ్‌కు కళాశాల సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

కష్టించి ఉన్నతస్థాయికి ఎదగాలి



కారుణ నియామక పత్రాలు అందుకున్న వారితో జీఎం

గోదావరిఖని: కష్టించి పనిచేసి వృత్తి నైపుణ్యంతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయం ఆవరణలో కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. ప్రయివేట్ సెక్టార్లలో ఉద్యోగాలు లభించని ఈరోజుల్లో సింగరేణి సంస్థలో ఉద్యోగాలు లభించడం అదృష్టమన్నారు. అందివచ్చిన ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాబోయే రోజుల్లో ఉన్నతస్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, డీజీఎం(పర్సనల్) రాజేంద్రప్రసాద్, సీనియర్ పీఓ వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వర ముక్తేశ్వరాలయ బోర్డు డైరెక్టర్‌గా ఎన్టీపీసీ ఉద్యోగి



సత్యనారాయణ

జ్యోతినగర్: శ్రీకాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ బోర్డు డైరెక్టర్‌గా ఎన్టీపీసీ రామగుండం ఉద్యోగి ఆరెల్లి సత్యనారాయణను నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. 2019లో బోర్డు డైరెక్టర్‌గా పనిచేసిన సత్యనారాయణను 2023లోనూ నియమించారు. ఆయన నియామకంపై పలువురు అభినందనలు తెలిపారు.

సింగరేణిలో బలమైన సంఘంగా బీఎంఎస్



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

గోదావరిఖని: సింగరేణిలో బలమైన సంఘంగా బీఎంఎస్ మారిందని ఆ యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. శుక్రవారం జీడీకే–1వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. 11వ వేతన ఒప్పందం కోసం బీఎంఎస్ తీవ్ర ప్రయత్నాలు చేసిందన్నారు. చివరికి సమ్మెకు కూడా సిద్ధమయ్యామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా జేబీసీసీఐపై ఒత్తిడి తీసుకవచ్చామని తెలిపారు. రాబోయే రోజుల్లో సింగరేణిలో యూనియన్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సారంగపాణి, హరీణ్, మాదాసి రవీందర్, బైరి శ్రీనివాస్, ఎర్రవెల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


అథ్లెటిక్స్ పోటీల్లో గోల్డ్ మెడల్



బంగారు పతకం అందుకుంటున్న రాధ

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీలో నివాసముంటూ ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–1లో సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్న బుగ్గాజి భార్య కాంటేవాడ రాధ అథ్లెటిక్స్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించింది. ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు హర్యానా రాష్ట్రం కురుక్షేత్రంలోని ద్రోణాచార్య అథ్లెటిక్స్ స్టేడియంలో నిర్వహించిన నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి మహిళా విభాగంలో రిలే రన్ ఈవెంట్‌లో పాల్గొని బంగారు పతకం సాధించినట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఆర్.ప్రభుకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రాధను ఆర్జీ–3 జీఎం, ఓసీపీ–1 పీవోతో పాటు పెద్దపల్లి జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.


పట్టుదలతో చదువుకోవాలి



విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తున్న జిల్లా విద్యాధికారి మాధవి

మంథని: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పట్టుదలతో చదివి తన లక్ష్యాన్ని సాధించుకోవాలని జిల్లా విద్యాధికారి మాధవి సూచించారు. శుక్రవారం మంథనిలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు పరీక్షల సమయంలో టెన్షన్‌కు గురికావద్దన్నారు. ప్రశాంతగా ఉండాలన్నారు. ఆమెతో పాటు ఎంఈఓ లక్ష్మి, తొలిమెట్టు రాష్ట్ర పరిశీలకుడు భరత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఘనంగా సింగరేణి స్కూల్ డే



బహుమతులు అందజేస్తున్న జీఎం కె.నారాయణ

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలోని సెక్టార్–1 సింగరేణి స్కూల్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు జీఎం కె.నారాయణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ, ఎస్ఓటూ జీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.